# ఓ నవ్వు ఆత్మహత్య చేసుకుంది

వి. విజయ లక్ష్మి

**"పెళ్ళి అనేది ఓ తోడుకోసం, కష్టసుఖాల్లో భాగం పంచుకునే ఓ అనుబంధం కోసం... దాన్ని డబ్బుతో, వెండి, బంగారాలతో, అర్థంలేని ఆచారాలతో, సాంప్రదాయాలతో కలుషితం చేయకుండా ప్రేమ, ఆత్మీయత, ఆప్యాయత, విశ్వాసం, గౌరవం లాంటి ముడులతో బంధించండి. పెళ్ళి మీకోసం మీరు చేసుకోండి. పదిమంది చూచి ఆనందించే 'షో'గా మార్చకండి! ఉన్నవాడు పెళ్ళిళ్ళకు ఖర్చు పెట్టడం తగ్గిస్తేనే మధ్య తరగతివాడు ఊపిరి పీల్చుకుంటాడు. పెళ్ళికీ, అప్పుకీ ముడి పెట్టుకోవడం మానేస్తాడు.**

ఈ సృష్టిలో అత్యంత సంక్లిష్టమైనదీ, ఎవరి ఊహకీ అందనిదీ మానవ స్వభావం ఒక్కటే. ఏ వ్యక్తి ఏ సమయంలో ఏ రకంగా ప్రవర్తిస్తా డన్న విషయం అతడికి లేక, ఆమెకు అత్యంత ఆప్తులయిన వాళ్ళు కూడా చెప్పలేని విషయం. 'ఆదర్శాలు వల్లించడం కాదు, ఆచరణలో పెట్టగలగాలి' అని వల్లించే వాళ్ళు కూడా తన దాకా వచ్చేసరికి ఏదో కారణం చేత క్రియాశూన్యు లవుతా రు. ఆశ్చర్యం ఏమిటంటే ఎవరి పరిధిలో, ఎవరి ఆలోచనలో వారికి తన ప్రవర్తన సమంజసంగానూ, పరిస్థితుల ప్రభావంగానూ అనిపిస్తుంది. కాబట్టి అది ఒప్పేనని వాళ్ళే కాదు - పక్కవాళ్ళ చేత కూడా ఒప్పించి, సమర్థించుకుని తృప్తి పడిపోతా రు.

ఈ సమాజం అనేది ఏకవచనమే అయినా రకరకాల భావాల, అభిప్రాయాల సంగమం. ఒకరికి ఒప్పయినది మరొకరి దృష్టిలో అతి పెద్ద తప్పు. సాధారణంగా తప్పొప్పుల నిర్ణయం మెజారిటీ మీదే సాగిపోతుంది. అయితే ఈ నిశ్శబ్ద సమరంలో ఎక్కడో ఓ చోట ఏదో ఓ మనసు 'నా ఆత్మే నాకు జవాబుదారీ' అనుకుని దెబ్బతిని, కనిపించని గాయానికి నెలవై కన్నీటిని కాదు - రక్తాన్ని స్రవిస్తుంది. ఆ గుండె గాయం ఏ స్కెత్‌స్కోపుకీ అందనిదీ, అత్యంత ఆత్మీయుల ఎక్సరే మనసుకి తప్ప గోచరించనిదీ.

అయిదేళ్ళ తరువాత స్వదేశంలో అడుగు పెట్టేటప్పుడు గుండె నిండా ఏదో ఉద్విగ్నత, ఆనందం, నన్ను నేనుగా నాలోని , అంతర్శక్తిని గుర్తించుకోవడానికి, దాని సాయంతో నాకు నేనుగా గుర్తింపు పొందడానికి చేసిన కృషి, సాధించుకున్న విజయం - అమెరికన్ యూనివర్సిటీ ఇచ్చిన స్వర్ణపతకం, డాక్టరేట్‌తో ఈ గడ్డమీద కాలు పెట్టాను.

అయిదేళ్ళ జీవిత సమర కాలంలో ఊపిరి పీల్చుకోవడానికి సమయం లేనంత కోలాహలం. అక్కడి వాతవరణమే అంత! ఆ హడావిడిలో మరింత వరిగెడితే తప్ప ఏదీ సాధించుకోలేం. అయితే ఆ వేగంలో కొన్ని అనుభూతులను దూరం చేసుకున్నాను కూడా. అత్యంత ఆత్మీయురాలయిన స్నేహితురాలితో 'ఉత్తర' కలయిక కూడా లేకపోవడం దురదృష్టకరం.

అనూరాధ నా ప్రాణ మిత్రురాలు అనేకంటే, 'ఆమె స్నేహాధి దేవత' అని పరిచయం చేయడం సబబుగా ఉంటుంది. నా నుంచి ఎలాంటి కదలిక లేకపోయినా ఆమె మనసులో నేను కదులుతూనే ఉంటా నన్నది నిర్వివాదాంశం. అ దొక సాంత్వన. 'ఉత్తరం రాయడానికి తీరిక లేదనుకుంటాను. కాని ఆరోగ్యం గురించి నిర్లక్ష్యం చేయకపోతే సంతోషం' అని. మందలింపు. పాఠాలతో ఉత్తరాలు రాసే అనూరాధ, గత రెండేళ్ళుగా మౌనవ్రతం పాటిస్తోంది. నాలుగు పదుల జీవితంలో అతి తీవ్ర సమస్యల్ని ఎదుర్కొన్నప్పుడు కలగని భయం ఈ మౌనంవల్ల కలుగుతోంది.

నాకంటె పెద్దదైన అనూరాధ నాకు స్నేహితురాలు, గురువు, అమ్మ - అన్నీను. అప్పటికీ రెండుసార్లు ఫోన్ చేశాను. 'అంతా బాగానే ఉన్నాంలే సంధ్యా! వయసు పైబడుతోంది కదూ! ఓపిక తగ్గుతోంది. అంతే!' అంది. కాని ఆ సంభాషణలోనే ఏదో అపశ్రుతిని పసిగట్టగలిగాను. ప్రశ్నించి ప్రయోజనం లేదని తెలుసు. ఇక ప్రత్యక్షంగా కలవడమే పరిష్కారం అనిపించి బయలుదేరాను.

బొంబాయిలో దిగగానే బంధువు లంతా చుట్టుముట్టారు. వా ళ్ళందరికీ ఆత్మీయురాలినై పోయా నిప్పుడు. ఒకప్పటి ఈసడింపులన్నీ మరిచిపోయాను. వీళ్ళని నేను క్షమించడానికీ అనూరాధే కారణం. నాలుగు రోజులు సరదాగా గడిచిపోయాయి. అనూరాధకి నేను వస్తున్నట్లు కూడా తెలుపలేదు. అకస్మాత్తుగా వెళ్ళి ఆశ్చర్యంలో ముంచెత్తాలి. కాకపోతే ఈ లాంఛనాలు ముగించుకుని నిదానంగా, తీరుబడిగా, వేరే ఆలోచనలు లేని మనసుతో వెళ్ళి కలిస్తేనే నాకు తృప్తి, అనూకీ తృప్తి.

హైదరాబాద్ బయలుదేరే ముందు ప్రభాకరం మామయ్యని చూడ్డానికి వెళ్ళాను. మామయ్య ఆరోగ్యం బాగాలేక బొంబాయిలో బంధువు లింట ఉండి వైద్యం చేయించుకుంటున్నాడు. మాకు దూరపు బంధువే అయినా చిన్నప్పుడు ఆయనతో బజార్లన్నీ తిరిగేదాన్ని. నా చిన్నప్పుడు టెలిఫోన్ అరుదైన పరికరం. నేను దాని గురించి అడగ్గానే మామయ్య వివరంగా చెప్పడమే కాదు, వాళ్ళ ఆఫీసుకి తీసుకెళ్ళి చూపించి ఎలా ఉపయోగించాలో నేర్పించాడు కూడా. అప్పటినుంచి నా మనసులో ప్రభాకరం మామయ్యకి టెలిఫోన్‌తో అవినాభావ సంబంధం ఏర్పడిపోయింది. టెలిఫోన్ చూస్తే ఇప్పటికీ ఒక్కోసారి మామయ్యే గుర్తొస్తాడు.

మామయ్య నన్ను చూసి చాలా సంతోషించాడు. దగ్గర కూర్చోపెట్టుకుని నా గురించి, నా పరిశోధనల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నాడు.

"నీకు పెళ్ళి కూడా అయి సుఖంగా కాపరం చేసుకుంటుంటే ఇంకా సంతోషించేవాడిని" అన్నాడు చివరకు.

నేను నవ్వాను - "అది జరగలేదు కాబట్టే ఇవన్నీ సాధించగలిగాను మామయ్యా. పెళ్ళి చేసుకుని పిల్లల్ని కన్న తృప్తి కంటే సాధించుకున్న ఈ విజయం నాకు సంతృప్తికరంగా ఉంది" అన్నాను. నా పెళ్ళి గురించి ప్రశ్నించిన వా ళ్ళందరికీ ఒకప్పుడు గంటన్నర ఉపన్యాసం దంచేదాన్ని. కాని అది కూడా అల్పమైన విషయంగానే తోస్తోం దిప్పుడు.

"నిజమే నమ్మా! అప్పట్లో నేను నీకు చూసిన సంబంధాల్లో ఏది చేసుకున్నా నలుగురు పిల్లలతో ఇంటికి బందీ అయిపోయేదానివి." ఒప్పుకున్నాడు.

"సంసార సాగరంలో పడి మునిగిపోకుండా, సప్త సముద్రాల అట్టడుగు భాగాల్ని శోధించే అవకాశం దొరకడం అదృష్టం కదా మామయ్యా!" నవ్వేశాను. కాని ఈ సంభాషణతో చాలా కాలంగా నాలో తలెత్తని ప్రశ్న మనసులో కదలాడింది. పదిహేను, ఇరవై ఏళ్ళ క్రితం నేను చూసిన, అనుభవించిన, ఎదుర్కొన్న పరిస్థితులలో మా ర్పేదైనా వచ్చిందా? స్త్రీని ఇప్పటికయినా మనిషిగా గుర్తిస్తున్నారా? వివాహ సమస్య తీరిందా?

నా సందేహాన్ని మామయ్య దగ్గర బయటపెట్టలేదు. నా సంశయాన్ని

తీర్చవలసింది ఆయన కాదు, ఈనాటి యువతరం. కారణం నాకు ముఖ్యంగా తెలియాల్సింది ఈనాటి యువతరంలో ఎలాంటి మార్పు వచ్చిందా అని.

మామయ్య తన బంధువులని పరిచయం చేశాడు. మహాలక్ష్మిగారు, ఆవిడ చెల్లెలు స్వాతి. స్వాతిని చూస్తే ముచ్చటేసింది. ఎం.ఎ. ఇంగ్లీష్ లిటరేచర్ చేసిందిట. అత్తవారిల్లు హైదరాబాద్ అనీ, అక్కడే లెక్చరర్‌గా చేస్తున్నాననీ చెప్పింది. భర్త ఇంజనీర్. చిన్న పాపాయి ఉంది తనకి.

మాటల్లో పెట్టి నా సందేహం గురించి అడిగాను.

"ఆడపిల్లల పెళ్ళి ఇప్పటికీ సమస్యేనండి. కట్నాలు విపరీతంగా పెరిగిపోయాయి. కాకపోతే, డబ్బుంటే మాత్రం ఎలాంటి సమస్యా లేదు. చాలామంది విద్యావతులై ఉద్యోగాలు చేస్తున్నారు. తల్లిదండ్రులు కూడా ఉద్యోగస్థులు. ఇద్దరి కంటే ఎక్కువ సంతానం లేకపోబట్టి అమ్మాయి పెళ్ళి సులభంగానే చేయగలుగుతున్నారు'' అంది.

నాకు ఆ జవాబు అసలు తృప్తి నివ్వలేదు. స్వాతి కేవలం తనకు తెలిసిన వర్గం తరపునే ఆలోచించి చెప్తున్నట్లనిపించింది. ఈ దేశంలో అత్యధిక జనాభా మధ్య తరగతి వర్గం. సమస్య నెప్పుడూ వారిని దృష్టిలో పెట్టుకుని చూడాలన్న విషయం నేను మరిచిపోలేదు.

''అంటే నువ్వూ ఎక్కువ కట్నం ఇచ్చే పెళ్ళి చేసుకున్నావా?'' అడిగాను.

''మేము కట్నం అంటూ ఏమీ ఇవ్వలేదనుకోండి. నాన్నగారు నా పెళ్ళి కోసం రెండు లక్షలు బాంక్‌లో వేసే ఉంచారు. బంగారం, వెండి ముందుగానే కొని పెట్టారు. పెళ్ళికి ముందు మూడేళ్ళుగా నేను సంపాదించినదీ నా పేరనే ఉంది. అన్నీ తెలును కాబట్టి వాళ్ళు కట్నం అంటూ అడగలేదు. నా పెళ్ళి మా వాళ్ళకు సమస్యా కాలేదు.''

ఊహూఁ! ఈ అమ్మాయి ఆలోచనలోనే లోపం ఉంది. కట్నం పట్ల ఈనాటి యువతరం ఆలోచనలు అలాగే ఉన్నాయా? అమ్మాయికి ఎంత ఆస్తి ఉన్నదీ, ఆమె పేర ఎంత డబ్బున్నదీ తెలుసుకోగానే పెళ్ళిళ్ళు అయిపోతున్నాయా? అది పురోగమనమని ఈనాటి ఆడపిల్లలు మురిసిపోతున్నారా? అప్పర్ మిడిల్ తరగతి వాళ్ళ ఈ ధోరణి వల్ల మధ్య తరగత వర్గం పాట్లు ఇక ఎక్కువై ఉండాలి.

''అంటే, నీ దగ్గర డబ్బుంది కాబట్టి కట్నం అంటూ అడగలే దంటావు?''

''అంతే కదండీ మరి. కాకపోయినా మావారు డబ్బు మనిషి కాదు. నేను నచ్చాను. అంతే చాలన్నారు. మామగారు అతి మంచివారు. అత్తగారే.





# అడవి

విపుల సృష్టి రహస్యాల్ని
విప్పి చెప్పే
విశ్వరూప సందర్శనం అడవి!
మానవ నాగరికత సర్వానికి
పుట్టిల్లు అడవి!
తాత్త్విక మహాప్రస్థానాలు నడయాడిన
నట్టిల్లు అడవి!

వేదం అడవి!
నాదం అడవి!
సత్యాన్వేషణను సతతమూ హర్షించే
సాధువాదం అడవి!

మౌనం అడవి
గానం అడవి
మౌనానికి - గానానికి మధ్య విస్తరించిన
గాంధర్వ స్వర ప్రస్థానం అడవి!

శిల అడవి
శిల్పం అడవి
శిలకూ - శిల్పానికీ నడుమ
ఇమిడి ఉన్న
విశ్వకర్మ రహస్యం అడవి!

దృశ్యం అడవి
చిత్రం అడవి
దృశ్యానికీ - చిత్రానికీ మధ్య
అల్లుకున్న చిరంతన సౌందర్య రేఖ అడవి!

నడక అడవి
నాట్యం అడవి
నడకకూ - నాట్యానికీ మధ్య
రెపరెప లాడిన పతాక ముద్ర అడవి!

పదం అడవి
పద్యం అడవి
పదానికీ - పద్యానికీ మధ్య
శిరసెత్తిన కరుణావేశం అడవి!

అడవి జపిస్తే
తీతువు లరుతాల్లో సైతం
యజు శ్శాఖను వాకాలు ఘోషిస్తాయి!
అడవి తపిస్తే
చెంచిత హృద యాంచలాల్లో సైతం
జ్ఞా నాగ్ని శిఖలు ప్రజ్వలిస్తాయి!
అడవి కోపిస్తే
ఎండిన మ్రోళ్ళు సైతం
అరణులై అగ్నుల్ని ప్రసవిస్తాయి!
అరు ణారుణ దావజ్వాలలు
దశదిశలా ప్రసరిస్తాయి!
అడవి శపిస్తే
రంగు రంగుల పూలు సైతం
ఫిరంగులై పేల్తాయి
నింగిలోని చుక్కలు మొత్తమూ
నెత్తురు కక్కుతూ నేల రాల్తాయి!
అందుకే నిన్నటి ఋషులైనా అడవుల్లోనే
నేటి వీర పురుషులైనా అడవుల్లోనే
నిన్నటి ఆదేశాలు అడవుల్లోనే
నేటి ఆరని ఆవేశాలూఅడవుల్లోనే!!



గడియారం శేషఫణి శర్మ

ఆవిడకు మాత్రం ఈ పెళ్ళి పట్ల ఏదో అసంతృప్తి ఉంది. మావారికి బాగా కట్నం ఇస్తామని వచ్చిన సంబంధాలు కాదని నన్ను చేసుకుంటా ననడం బాధ పెట్టిందేమో తెలియదు'' అంది స్వాతి.

''అంటే, నిన్ను సరిగ్గా చూడదా? దెప్పుతుందా?'' రెట్టించి అడిగాను.

''అబ్బే, అలాంటి దేం లేదులెండి. మేము విడిగానే ఉంటాం. ఆవిడ మా ఇంటికి రాదు. ఆత్మీయంగా పలకరించదు. మేము వెళ్ళినా ఏదో మాట్లాడాలన్నట్లు మాట్లాడుతుంది. అంతే!''

''అదేనండీ మా బాధ. ఇంట్లోనే ఉండే మనిషి కదా. ఈ చంటిదాన్ని కాస్త చూసుకోవచ్చు కదా. ఊహు. సోషల్ సర్వీస్ అని అనాథాశ్రమాలకి వెళ్ళిపోతుంది. నలుగుర్లో పేరు రావాలని తపన. ఇప్పుడు స్వాతి ఉద్యోగానికి వెళితే పాపని క్రెష్‌లో వదలి వెళ్ళాలి'' అంది మహాలక్ష్మి.

ఈ దేశంలో కూడా మానవ సంబంధాలు, బంధాలు క్షీణిస్తున్నా యన్నమాట. ఏదో చేదు తిన్న భావం. నా ఈ దేశం సభ్యత సంస్కారాలకు, పటిష్ఠమైన కుటుంబ బంధాలకు నిలయమని, ఆప్యాయం, ఆత్మీయతల కొరత ఉండదని అక్కడ గొప్పగా చెప్పుకుంటాం. పసివాళ్ళని పరాయివాళ్ళ దగ్గర వదలి వెళ్ళే అవసరమే ఉండదని, అమ్మమ్మలు, నానమ్మలు పిల్లల్ని ఆత్మీయంగా పెంచుత రనీ, కాబట్టే పిల్లలకు కుటుంబ సభ్యులతో గాఢమైన అనుబంధం ఏర్పడుతుందనీ, పిల్లలు ప్రేమానురాగాలతో పెరుగుత రనీ కథలుగా చెప్పుకుంటా రక్కడ. పెద్దవాళ్ళు చూడక, ఇటు తల్లిదండ్రులు ఉద్యోగాల కని పరుగులు పెడుతూ పిల్లల వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడలేక పోతున్నా రన్నమాట! దిగులేసింది.

స్వాతి పాపని తీసుకొచ్చి చూపించింది. బొద్దుగా, తెల్లగా, అందంగా బొమ్మలా ఉంది పాప.

''ఏం పేరు పెట్టారు?'' అడిగాను. ఇంత అందమైన పాప పేరేమై ఉంటుందా అని.

''ఇంకా నిర్ధారించలేదు. నాకు రమ్య అని పెట్టాలనుంది. మావారికి 'అనూష' అన్న పేరు ఇష్టం. మా అమ్మ వాళ్ళు 'దీప' అన్నారు. మా అత్తగారు 'పాపాయి దీపంలా తను కాలుతూ అందరికీ వెలుగు నిచ్చేది కాకూడదు. జ్వాల అనో, అపరాజిత అనో పెడితే బావుంటుంది' అన్నారుట. ఆవిడ ఏదీ శాసించదు కాని, అలా అన్నాక బావుండదు కదాని ఆలోచిస్తున్నాం.''

"పే ర్లన్నీ బావున్నాయి. ఆవిడ అభిప్రాయమూ బావుంది" అన్నాను.

"ఆవిడ ఇదివరలో ఏదో ఫెమినిస్టు సర్కిల్‌లో తిరిగిందిట లెండి. ఇప్పుడవన్నీ లేవనుకోండి" అంది స్వాతి.

"మంచిదే గదా! సోషల్ సర్వీస్, ఫెమినిస్టు సర్కిల్. చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. అందులో వయసులో పెద్దావి డనుకుంటాను. నాకు ఆవిడను చూడాలనుంది" అన్నాను.

"ఓ తప్పకుండా. ఆవిడ పేరు అనూరాధ. అశోక్‌నగర్ పార్క్ దగ్గరే మా ఇళ్ళు. చాలా సులభంగా కనుక్కోవచ్చు" అంది స్వాతి.

ఒక్క క్షణం స్వాతి మాటలు నా బుర్రలో కెక్కలేదు. అనూరాధ - అశోక్‌నగర్ పార్క్. ఇంతసేపూ మేము మాట్లాడుకున్నది మా అనూరాధ గురించేనా? అవును. తన కో కొడుకూ, కూతురూ. కొడుకు ఇంజనీర్. అప్పుడే పెద్దవాళ్ళయి, పెళ్ళిళ్ళయి పిల్లలు కూడానా? ఇవన్నీ నాకు తెలియవే!

"అంటే, నువ్వు చైతన్య భార్యవా?" సందేహంగా అడిగాను.

"అవును. మావారు మీకు తెలుసా?" సంభ్రమంగా అడిగింది స్వాతి.

"పరిచయం ఉంది. అన్నట్లు అనూరాధ రైల్వేలో జాబ్ చేసేది కదూ?"

"చేసేవారు. నా పెళ్ళయ్యాక వాలంటరీ రిటైర్‌మెంట్ తీసేసుకున్నారు."


"అప్పట్లో చాలా యాక్టివ్‌గా ఉండేదే!"

"అవునుట. రెండేళ్ళ క్రితం వరకు స్త్రీల గురించి చాలా చేసేవారట. కాని, ఇప్పుడు చాలా మారిపోయారని అందరూ అంటుంటారు. బహుశా తన పిల్లల పెళ్ళి ళ్ళొచ్చేసరికి భావాలు మారిపోయి ఉంటాయి. ఫెమినిస్టు సర్కిల్‌లో ఉంటూ, కట్నాలు అడగడం అదీ బావుండదు కదా" అంది మహాలక్ష్మి కలగజేసుకుని.

"కా దక్కా! ఆవిడేం డబ్బు కోసం వెంపర్లాడే మనిషిలా అనిపించదు. నా అనుమానం ఆవిడ మెంటల్ పేషెంటని. లేకపోతే భర్త పట్ల కూడా అలా ప్రవర్తించాల్సిన అవసరం లేదుగా. అన లావిడ నవ్వగా నేను చూడలేదు. నవ్వినా ఆ నవ్వు కృత్రిమంగా అనిపిస్తుంది. బలవంతంగా నవ్వినట్లనిపిస్తుంది" అంది స్వాతి.

అనూరాధ మెంటల్ పేషెంటా? నమ్మలేని విషయం. ధైర్యం, పట్టుదల, మంచితనం, వివేకం, పరోపకారత్వం, స్నేహం, చెడుని ధైర్యంగా ఎదుర్కొనే నైజం - అన్నీ కలసి మూర్తీభవించిన గొప్ప హృదయం గల ఆదర్శ మహిళ మా అనూరాధ. అలాంటి అనూరాధ ఇలా మారడానికి కారణం? ఊహూ, నాకు తెలియని విషయం ఏదో ఉంది. వెంటనే తనను కలిస్తేనే గాని నాకు మనశ్శాంతి లేదు.

మర్నాడే హైదరాబాదు రై లెక్కాను. అమూరాధ గురించి విన్న విషయాలు నా చెవుల్లో గింగురు మంటున్నాయి. నా గతం అనూరాధతో ముడిపడి ఉంది. ఆ గతంలోకి వెళ్ళిపోయాను.




నలుగురు సంతానంలో మూడోదాన్ని నేను. ఓ అక్కయ్య, అన్నయ్య, చెల్లి ఉన్నారు నాకు. నాన్నగారి జీతం ఒక్కటే ఆధారం మాకు. అక్కయ్య తప్ప అందరం చదువుకుంటున్నాం. నాన్న అక్కయ్యకు పెళ్ళి సంబంధాలు చూస్తున్నాడు. ఎంతోమంది వచ్చి చూడడం, నచ్చిం దనడం, బేరాలు మొదలుపెట్టడం. చూస్తున్న నాకు చాలా చిరాగ్గా అనిపించేది. ఒళ్ళు మండిపోయేది. అక్కకు మాత్రం ఎలాంటి బాధా ఉండేది కాదు. చివరి కో సంబంధం కుదిరింది. అబ్బాయి ఆఫీసు గుమాస్తా. పెళ్ళికి దాదాపు అరవై వేలు ఖర్చయింది. అందులో ముప్పయి వేలు అప్పు. అది తీర్చడానికి మూడేళ్ళు పట్టింది. పెళ్ళంటే, ఈ అర్థంలేని ఆచారాలంటే నాలో అసహ్యం కలగడం మొదలైంది అప్పుడే. డిగ్రీ అవగానే అన్నయ్యకు ఉద్యోగం వచ్చింది.

నేను ఇంటర్ కాలేజీ ఫ స్టొచ్చాను. బి.ఎస్‌సి.లో చేరాను. నాన్నకి నా పెళ్ళి చేసెయ్యాలని తొందర. అన్నయ్యదీ, నాదీ ఒకసారే చేస్తే కట్నానికి తడుముకోవలసిన అవసరం లేదని ఆయన ఆలోచన. కాని నేను చాలా నలుపు. ఏమీ బావుండను. ముఖం నిండా స్ఫోటకం మచ్చలు. నన్ను చూడడానికి వచ్చిన వాళ్ళంతా చెల్లిని గురించి అడిగేవారు. అది చాలా అందంగా ఉంటుంది. వయసుని మించి కనిపిస్తుంది.

ఓ సంవత్సరం గడిచినా నాకు సంబంధం కుదరలేదు. సెకండియర్‌లో ఉండగా నాకు ఉద్యోగం వచ్చింది. చేరాలా, వద్దా అని మీమాంస. నా కయితే బాగా చదువుకోవాలని ఉండేది. కాని నాన్నకు భయం. ఎంత చదివితే అంతకంటే చదివినవాడిని తీసుకురావాల్సి వస్తుందని.

నా కా భయం లేదు గాని - "డిగ్రీ పూర్తయినా నీకు వచ్చే ఉద్యోగం ఇదే. వచ్చిన అవకాశం పోగొట్టుకోకు!" అన్నాడు అన్నయ్య. నాకు అదీ నిజమే ననిపించింది. నా వ్యక్తిత్వం నేను నిలబెట్టుకోవాలంటే ఉద్యోగం అవసరం అనుకున్నాను. చదువు మానేసి ఉద్యోగంలో చేరాను.

అయినా నాకు పెళ్ళి కుదరలేదు. ఎక్కువ కట్నం ఇస్తే నా అనాకారితనం మరుగున పడిపోతుందట. "కట్నం తీసుకునేవాడిని నేను చేసుకోను. మామూలు గుమాస్తా చాలు నాకు. నేనూ కష్టపడి పని చేస్తాను. మా కదే చాలు" అన్నాను.

నా భావాలను అర్థం చేసుకునే వా ళ్ళున్నారో, లేదో నాకు తెలియదు కాని, మా కయితే తారసపడలేదు.

"నీ అందానికి తోడు కట్నం ఇవ్వకపోతే ఎవరు చేసుకుంటారు?" అన్నది చెల్లి కూడా. వా ళ్ళిద్దరి పెళ్ళిళ్ళూ ఓ అన్నా-చెల్లెళ్ళతో కుదిరిపోయేలా ఉన్నాయి. వా ళ్ళిద్దరి పెళ్ళి చేసెయ్యమని నాన్నతో చెప్పాను.

ఆయన వినిపించుకోలేదు. చెల్లెలికి కూడా ముందే అయిపోయిందంటే కట్నం ఇంకా అడుగుతారట.

అందరూ మాటలతో, చేతలతో నన్ను గాయపరచడం మొదలుపెట్టారు. "కట్నం తీసుకునేవాడిని చేసుకోదట. పెద్ద ఆదర్శాలు" అంటూ నవ్వేవారు. నా వాళ్ళే నన్ను నానా మాటలూ అనడం నాకు చాలా బాధ కలిగించేది. నాలో దిగులు మొదలయింది. ఆ సమయంలోనే నాకు అనూరాధ పరిచయం అయింది.

కమల నా చిన్ననాటి స్నేహితురాలు. రైల్వేలో ఉద్యోగం చేస్తోంది. అది ఒక అబ్బాయిని ప్రేమించింది. వాళ్ళ పెళ్ళికి ఇద్దరి పెద్దవాళ్ళూ ఒప్పుకోలేదు. కమల ఇంటికి పెద్ద కూతురు. దాని సంపాదన వల్లే తరువాతి నలుగురు పిల్లల చదువులు సాగుతున్నాయి. అది పెళ్ళి చేసుకుని వెళ్ళిపోతే వాళ్ళ గతేమిటి? అదీ దాని తల్లిదండ్రుల బాధ.

రావలసిన లక్షల కట్నం పోతుందని అతడి తల్లి బాధ. కమల అనూరాధతో తన సమస్య చెప్పుకుంది. అనూరాధ ఇద్దర్నీ కూర్చోపెట్టి మాట్లాడింది. పెళ్ళయినా కమల తన వాళ్ళకు సాయం చేయొచ్చు నన్నాడు అతడు. అనూరాధ సాయంతో వాళ్ళ పెళ్ళి జరిగింది. ఆ పెళ్ళికి పదిమందిమి మాత్రమే ఆహ్వానితులం. రిజిస్టర్ మారేజీ ఫీజు పది, విందు భోజనం ఖరీదు అరవై - మొత్తం డెబ్బై రూపాయలతో పెళ్ళి జరిగింది.

"పెళ్ళిళ్ళు ఇంత తక్కువ ఖర్చుతో సులువుగా చేసుకోవడం మాని,

భేషజాలకు పోయి, అప్పులు చేసి ఒక్క రోజునే వేలకు వేలు ఖర్చు పెడతారు. తరువాత ఎన్నేళ్ళు కష్టపడితే ఆ అప్పులు తీరతాయి? అయినా మన మనుషులు మారడం లేదు. ఈ తరం యువతే వాళ్ళని మార్చాలి. తమ కొడుకు వయసువాడయిన అబ్బాయి కాళ్ళు కడిగి, అమ్మాయిని ఏదో వస్తువులా అతడికి దానం చేయడం స్త్రీ జాతికి ఎంత అవమానం? చదువుకున్న అమ్మాయిలు కూడా ఇలాంటివి ప్రతిఘటించడం లేదు'' అంది అనూరాధ.

నా కామె వాదం చాలా నచ్చింది.

''అవునండీ! తాగి సరిగా నడవలేకపోతున్న అబ్బాయిని పట్టుకుని కూర్చోపెట్టి, అతడి మురికి కాళ్ళు కడిగి కన్యాదానం చేసిన తల్లిదండ్రులని చూశాను నేను. ఏదో రకంగా పెళ్ళి అయిపోతే చాలని అమ్మాయిలూ భావిస్తున్నారు. ఈ దేశం ఎప్పటికి బాగుపడుతుందో!'' అం దో అమ్మాయి.

మర్నాడు నేను వెళ్ళి అనూరాధని కలసి నా సమస్య చెప్పాను. ''ఇప్పుడు మరో సంభంధం వచ్చిందండీ. అతడికి రెండో పెళ్ళి. మొదటి భార్య ఆత్మహత్య చేసుకుని చనిపోయిందిట. 'ఆ అమ్మాయి మెంటల్ పేషెంటట' అని సమర్థిస్తున్నారు. నాకు అనుమానంగా ఉందంటే - 'అన్నింటికీ వంకలు పెడతావు. ను వ్వనాట్లుగా అతడు కట్నం అడగడం లేదుగా' అని తిడుతున్నారు. నేనేం చెయ్యను. ఆ పెళ్ళికి ఒప్పుకోవలసిందేనా?'' అంటూ ఏడ్చేశాను.

అనూరాధ నావైపు కోపంగా చూసింది. ''ఆడవాళ్ళకు కన్నీళ్ళు తప్ప మరో స్వాంతన లేదని నువ్వూ నిరూపిస్తున్నావా? చదువుకున్న దానివి, ఉద్యోగం ఉంది. నీకేం తక్కువయిందని ఈ ఏడుపు? సమాజాన్ని భ్రష్టు పట్టిస్తున్న ఓ దు రాచారాన్ని బహిరంగంగా ఖండిస్తున్నావు. అది నీకు తృప్తి నివ్వడం లేదా? ఇక ఎన్నడూ కంట తడి పెట్టకు. నీ జీవితం నీది. మ రెవరి కోసం నిన్ను నీ ఆశయాలని త్యాగం చేసుకోవలసిన అవసరం లేదు. నువ్వు నమ్మిన సిద్ధాంత న్ని నువ్వే గౌరవించలేకపోతే ఎలాగ? ఏదోలా సర్దుకుపోవాలి అన్న ధోరణిలో పెరిగి, సమాజానికి భయపడి తన ప్రారబ్ధం అని సర్దుకుపోయే స్త్రీ చావాలని కోరుకునేంత అధమ స్థితికి దిగజారిందంటే, ఎలాంటి విషమ పరిస్థితి కలిగించాడో తెలుస్తూనే ఉంది. అలాంటి మగవాడికి భార్య వయ్యేకంటే అవివాహితురాలిగా మిగిలిపోవడం మేలు !'' అంది అనూరాధ.

''నా ఉద్దేశమూ అదే. కాని, మా నాన్నగారు ఒప్పుకోవడం లేదు'' అన్నాను.

అనూరాధ నాతో పాటు మా ఇంటికి వచ్చింది. అప్పు డా పెళ్ళికొడుకు అక్కడే ఉన్నాడు. అనూరాధని చూడగానే చెప్పాపెట్టకుండా వెళ్ళిపోయాడు.

''ఇతడేనా కట్నం అడగని ఆదర్శ పురుషుడు? అతడి భార్య మా ఆఫీసులోనే పని చేసేది. ఇతడికి చాలా అనుమానం. పదిసార్లు ఆఫీసుకి వచ్చి చూస్తుండేవాడు. ఆమె నవ్వినట్లు కనిపిస్తే చాలు, ఇంటి కెళ్ళగానే వాతలు పెట్టేవాడు. అతడి బాధలు భరించలేక ఆత్మహత్య చేసుకుంది?'' అంది అనూరాధ.

''దీని అందానికి అలాంటి బాధ లుండవు లెండి'' అన్నాడు అన్నయ్య.

అనూరాధకి బాగా కోపం వచ్చింది. ''అనుమానించాలంటే ఆడది అయుంటే చాలండి. అందంతో పని లేదు'' అంది.

''అన్నింటికి వంకలు పెడితే ఎలా? వీ ళ్ళిద్దరి పెళ్ళిళ్ళు నిశ్చయమైపోయాయి'' అన్నాడు నాన్న.

''వాళ్ళ పెళ్ళిళ్ళు జరిపించెయ్యండి. ఆడపిల్లకు పెళ్ళి మాత్రమే ముఖ్యం కాదు. తనకు నచ్చినవాడు, తనను తనగానే గౌరవించేవాడు దొరికినప్పుడే సంధ్య పెళ్ళి చేసుకుంటుంది.''

''నువ్వు నాకు నీతులు చెప్పనక్కరలేదు. ఇప్పు డిలాగే అంటారు. తరువాత మా బాధలు ఎవరికి తెలుస్తాయి?'' అంటూ అనూరాధని నానా మాటలు అన్నాడు నాన్న.

అనూరాధ వాళ్ళకి ఎలాంటి జవాబు చెప్పలేదు. అప్పటికప్పుడు ఆమె చెప్పినట్లుగా సూట్‌కేస్ తీసుకుని బయటపడ్డాను. వర్కింగ్ వుమన్స్ హాస్టల్‌లో చేరాను. నాన్న వచ్చి ఎన్ని రకాలుగా బెదిరించినా, బ్రతిమిలాడినా లొంగలేదు. రెండు నెలల్లో నాన్న వా ళ్ళిద్దరి పెళ్ళిళ్ళూ చేసేశాడు. నేను వెళ్ళలేదు.

ఆరు నెలలు గడిచాయి. ''సంధ్యా! బ్రిలియంట్ స్టూడెంటువి. ను వ్వెందుకు చదువు కొనసాగించకూడదూ?'' అంది అనూరాధ.

ఆ ఆలోచన నా కెందుకు తట్టలేదని తిట్టుకున్నాను. నేను సంపాదించుకున్న డబ్బు నా పేరనే ఉంది. ఉద్యోగం మానేసి డే కాలేజీలో చేరాను. దానికీ నన్నూ, అనూరాధనీ తిట్టిపోశాడు మావాళ్ళు. నేను కేర్ చెయ్యలేదు. అనూరాధ ప్రోత్సాహం, అండదండలతో నేను స్వయంగా కష్టపడ్డాను. చదువు ఓ తపస్సులా భావించాను. ఈ సమాజం మీద నాకున్న కసినంత పట్టుదలగా మార్చి చదివాను. బి.ఎస్‌సి.లో కూడా కాలేజీ ఫస్టు వచ్చాను. యూనివర్సిటీ రాంక్ వచ్చింది. అమెరికన్ యూనివర్సిటీకి అప్లయి చేశాను. స్కాలర్‌షిప్‌తో సహా సీ టొచ్చింది. సంతోషంతో పొంగిపోయాను. నేను అమెరికా వెళ్తున్నప్పుడు వచ్చారు నా వాళ్ళు. నవ్వుకున్నాను.

పోస్టు గ్రాడ్యుయేషన్ కాగానే ఉద్యోగం వచ్చింది. ఇండియా వచ్చినప్పుడు చదువు అంతటితో ఆపవద్దంది అనూరాధ. వెళ్ళగానే పిహెచ్.డి.లో చేరాను. అయిదేళ్ళు కష్టపడ్డాను. డబుల్ డాక్టరేట్ తీసుకున్నాను. నా కిష్టమైన ఓషెనోగ్రఫీ సబ్జెక్ట్‌లో స్వర్ణపతకం వచ్చింది. నా పరిశోధనల ఫలితంగా రెండు పుస్తకాలు ప్రచురించాను. నాకు నేనుగా గుర్తింపబడ్డా నన్న తృప్తి అప్పుడు కలిగింది నాకు. ఆ ఆనందాన్ని మూట కట్టుకుని అనూరాధ దగ్గర విప్పడానికి బయలుదేరి వచ్చాను.

రైలు సికింద్రాబాద్ స్టేషన్‌లో ఆగింది. ఇంటి కెళ్ళి స్నానం చేసి, అనూరాధ ఇంటికి వెళ్ళాను.

''సంధ్యా! ఎప్పు డొచ్చావ్? బావున్నావా?'' అనూరాధ భర్త రామ్మూర్తి గుమ్మంలోనే ఎదురై అడిగాడు.

''వచ్చి వారం అయింది. బాగానే ఉన్నాను. మీ రెలా ఉన్నారు?''


# JOIN MERCHANT NAVY

## BY PASSING GOVT OF INDIA EXAM.

**APPLICATIONS ARE INVITED** from ambitious young men and women candidates above 17 years for the admission for **MARINE RADIO OFFICERS COURSE.** This 16 months course is conducted for the first time in Hyderabad by Indian Marine College affiliated to the reputed group of All India Marine College, Cochin-Govt of India Licence No. 426-an institution with proven record of results. Eligibility for Admission: Minimum SSC pass, but intermediate and above preferred. Age minimum 17 years, but no upper age limit. Examination conducted and certificate issued by the Govt. of india. Excellent job opportunities are available in Foreign and Indian Shipping Companies, Telecommunication establishments in foreign countries, Govt. organisations like Shipping Corporation of India, ONGC, Port Stations, Police depts, Railway, P & T etc. Hostel available. Nominal fees payable in instalments. For details and application form send Rs. 20/- MO/DD or contact personally at once **INDIAN MARINE COLLEGE** Near Venkataramana Cinema, 5-4-214/5A, Kachiguda Station Road, HYDERABAD-500 027.

## మొదటి ముద్దాయి కాలం

చేతులు కట్టుక నిలచి
మొదటి ముద్దాయి కాలం!
కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ
నిలుచోలేక వాలిపోతున్న
రెండో ముద్దాయి అంధకారం!

చారిత్రక సుధా స్రవంతుల ఘలంఘలలను
శవ దుర్గంధంతో నింపింది కాలం
కలకలలాడే నరనారీ శిరోమణుల శవాలు
తళతళ లాడే మానవ సృజనల శవాలు
జీవన కాంతుల మెరిసే
పచ్చని పంట పొలాలు శవాలు
సహస్రాంకురాల భావి స్వప్న రాశిని
నిర్ధూమ ధామంగా మార్చింది అంధకారం

కాలం పాల్పడిన హత్యా నేరాలకు
బాసటగా నిలచింది, సహకరించింది
వత్తాసు పలికింది. గుప్తవర్తించింది
దురహంకార స్వరూపి అంధకారం!

కాలమా, ఉన్మత్తకాకోలమా!
నీ జిఘాంసనీ, మానవ విద్వేషాన్నీ
సత్క్రియా సముదాయంపై అసహిష్ణుతనీ
పరిస్థితులపై నెట్టివేయలేవు సుమీ!
నీ దురంత కిల్బిషానికి నిష్కృతి లేదు!

నిన్నటి కిరీటాల గర్వ రేఖల్ని
పార్థివ సౌభాగ్యాల్ని క్షణిక మొనర్చావు
ధగద్ధగాయమాన రోచిరోత్సవాలను
నిర్జీవ తమోనలంగా మార్చావు

ఇన్ని చేసినా, గతానికి దుఃఖించని చరిత్ర
క్షమించింది నిన్ను! నిరవధిక క్రౌర్యంతో
పెట్రేగిపోతున్నావు. వర్తమానంలో
అజ్ఞాన మహాటవిగా బలిసిపోయావు



నీ మహా విధ్వంస యాత్ర
ఇప్పటికీ ముగియలేదు!
నా దేశాకాశం పై
కాంతి రేఖల సహస్రాంశువులు
ఛిద్ర పరంపరలు నేడు
నా దేశ ధరిత్రీతలంపై
రోచిర్నివహాలు సహస్రాశ్రువులు!
సకలం విచ్ఛిన్న ముఖ సౌందర్యం నేడు
మధుర స్వప్నాల లాలిమపై
విష నిశ్వాసాలు ప్రసరిస్తూ నీ ఏడుగడ ...
హరిత సద్మాల లతానికుంజాలను
ఛిన్నా భిన్న మొనర్చిన హంతకి నీవే!
దురంతకాలమా! నీకు తప్పదు
శిక్షా నిగళ బంధనం!

లోకం గుండెలలో
చిరావాసంగా దుఃఖాబ్దులు
పీడనాకర సంవేదనల దుర్వీథులు
శతాబ్దాల పరిమళ భరిత
జలజాతాల మెత్తని రేకుల్ని
తుత్తునియలుగా చిదిమావు!
అంతులేని నీ రాక్షస జిఘాంస
ఎంత మాత్రం క్షమించదు చరిత్ర!

పెర్రరిజానికి నీవే సదాశయం తగిలించినా
అది మానుషత్వాన్ని మంటపెట్టక తప్పదు!
కాలమా, తృణచ్ఛన్నకూపమా!
నీ అసంఖ్యాక హత్యా నేరాలకు
శిరఃఖండనాల సుదీర్ఘ శిక్ష తప్పదు!

సోమసుందర్

---

"నా కే మమ్మా! బాగానే ఉన్నాను. బాధ్యతలు తీరిపోయాయి. మనవలతో ఆడుకుంటూ గడిపేస్తున్న రోజులు."

"అనూ ఏదండి?"

"అనూరాధ ఇంట్లో ఉండటం లేదమ్మా. అనాథాశ్రమంలో ఉంటోంది. అడ్రస్ ఇస్తాను వెళ్ళు. దగ్గరేలే!" అన్నాడు నిర్లిప్తంగా.

అనూరాధ ప్రవర్తన ఆయన్ని కూడా బాధపెడుతోందని చెప్పకుండానే అర్థమైంది.

"ఈ మధ్య ఉత్తరాలు కూడా రాయడం మానేసింది. ఫోన్ చేసినా సరిగా మాట్లాడలేదు. ఏం జరిగిందండీ?" అడిగాను. అనూరాధ గురించి ఆయన వాదన కూడా వినా లనిపించింది.

"ఏమిటో నమ్మా! ఏమీ చెప్పదు. ఆమె దిగు లేమిటో నాకూ అర్థం కావడంలేదు. బాధ్యతలు తీరిపోయాయి. పిల్ల లిద్దరూ అన్నివిధాలుగా స్థిరపడి సంతోషంగా ఉన్నారు. దేనికీ కొరత లేని సంసారం మాది. మాకు చెప్పకూడని బాధలు తన కేమిటో తల బద్దలు కొట్టుకున్నా అర్థం కావడంలేదు. మానసిక రుగ్మతేమోనని డాక్టర్ దగ్గర కెళదామంటే రాదు. ఎన్ని ప్రశ్న లడిగినా నోరు విప్పదు. అందర్నీ దూరం చేసుకుంది. స్త్రీల సమస్యలని ఎంత ఆరాటపడే దప్పుడు. అవన్నీ కూడా మానేసింది. అన లా విషయాల గురించి అడిగినా సమాధానం కూడా చెప్పదు. అందరూ వచ్చి అసంతృప్తితో వెళ్ళిపోతున్నారు. ఇప్పు డీ ఆశ్రమం పనిలో పడింది."

"అంత మార్పా? సంగ తేమిటో నేను కనుక్కుంటాలెండి" అన్నాను.

"ప్రయత్నించు. ఫలితం ఉంటుం దనుకోను."

ఆయన మాటల్లో నిరాశ నన్ను కదిల్చింది. అప్పటివరకు నేను విన్నదంత అబద్ధమేమో నన్న ఆలోచన పటాపంచలైంది.

మెల్లిగా కదిలాను. ఆయ నిచ్చిన అడ్రస్‌కి చేరుకున్నాను. ప్రభంజనంలా వచ్చి అనూరాధని ఉక్కిరిబిక్కిరి చేయా లనుకున్న దాన్ని కదిలే శక్తి లేనిదానిలా నెమ్మదిగా వెళ్ళాల్సి వస్తుం దనుకోలేదు. ఆమెను చూడబోతున్నా నన్న ఉద్వేగం, ఆనందం చప్పబడిపోయాయి.

కానీ అంతలోనే వివేకం మేల్కొంది. గురువుగా అనూరాధ నాకు నేర్పించిం దేమిటి? "తొందరపాటు నిర్ణయాలు కూడదు. ప్రతి సమస్యకీ ఓ పరిష్కారం ఉంటుంది. సమస్య విని బెంబేలు పడిపోకుండా పరిష్కారం గురించి ఆలోచించు. నాణేనికి రెండు వైపు లున్నట్లే సమస్యకూ మనకి కనిపించని మరో రూపు ఉంటుంది. నీ కోణంలోంచి మాత్రమే ఆలోచించకు. రెండో వైపునీ పరిశీలించు."

ఈ రోజు నే నింతదాన్ని కావడానికి కారణం అనూరాధ ఇచ్చిన ప్రోత్సాహమే. ఆమెలో రుగ్మత ఉంటే అమెరికా అయినా తీసుకెళ్ళి నయం చేయించాల్సిన బాధ్యత నామీ దుంది. ఆ ఆలోచన రాగానే హుషారుగా ఆశ్రమంలోకి అడుగు పెట్టాను.

[ముగింపు వచ్చే సంచికలో]